పాలనలో జాప్యం.. ప్రజలకు శాపం

నియోజకవర్గంలో వేధిస్తున్న అధికారుల కొరత
- ముఖ్య శాఖల్లోనూ ఇన్‌చార్జులదే పాలన..
- పూర్తిస్థాయి అధికారులు లేక పనుల్లో తీవ్ర జాప్యం

చీరాల టౌన్:

బాపట్ల జిల్లాలో వాణిజ్య పట్టణంగా ఖ్యాతి పొందిన చీరాల నియోజకవర్గంలో ముఖ్యమైన పాలనాశాఖల్లో ఇన్‌చార్జుల పాలన నడుస్తోంది. ఆయా శాఖల్లో పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు ఇన్‌చార్జులను నియమించారు. పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో పాలనా వ్యవహారాల్లో జాప్యం జరుగుతోంది. చీరాల నియోజకవర్గంలోని రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఇలా అన్ని శాఖల్లో అధిక శాతం ఇన్‌చార్జుల పాలన నడుస్తోంది. ఫలితంగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికార బాధ్యతలతో పాటు అదనపు బాధ్యతలను కూడా నిర్వహించడంతో పాలన నత్తేరుపై నడకలా సాగుతోంది. నియోజకవర్గంలో చీరాల, వేటపాలెం మండలాలు, చీరాల మున్సిపాలిటీలున్నాయి. చీరాల మండలంలో 15 గ్రామ పంచాయతీలు, వేటపాలెం మండలంలో 9 గ్రామ పంచాయతీలు, చీరాల మున్సిపాలిటీలో 33 వార్డులున్నాయి. చీరాల మండలంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న కుర్రా గోపీ కృష్ణ నియోజకవర్గానికి తహసీల్దార్‌గా వ్యవహరిస్తున్నారు. చీరాల మండలానికి రెగ్యులర్‌గా, వేటపాలెం మండలానికి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. చీరాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.శివన్నారాయణ మార్టూరుకు ఏపీడీగా పదోన్నతిపై వెళ్లడంతో చీరాల ఈఓఆర్డీ రామకృష్ణకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్నారు. వేటపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఈవోఆర్డీ, పలు విభాగాల సిబ్బంది లేకపోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలానే చీరాల, వేటపాలెం మండలాలకు రెగ్యులర్ డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు లేకపోవడంతో ఇన్‌చార్జి డీటీలతో నెట్టుకొస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమైన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా నాగరాజు చీరాలకు రెగ్యులర్‌గా, వేటపాలేనికి ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. చీరాల హౌసింగ్ ఏఈగా పనిచేస్తున్న అధికారిగా హౌసింగ్ డీఈగా పదోన్నతి రావడంతో ఇన్‌చార్జి ఏఈగా మరొకరు పనిచేస్తున్నారు. అలానే గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నిర్మూలించి ఉపాధి కల్పించే ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోగా దాసు చీరాల, వేటపాలెం మండలాలకు ఏపీవోగా పనిచేస్తున్నారు. అలానే రెగ్యులర్ వీఆర్వోలు లేకపోవడంతో పలువురిని ఇన్‌చార్జి వీఆర్వోలుగా నియమించుకుని పనులు చేయిస్తున్నారు. చీరాల మండలానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు లేకపోవడంతో సీనియర్ వీఆర్వోలను ఇన్‌చార్జి ఆర్‌ఐలుగా నియమించుకుని పనులు చేయించుకుంటున్నారు. డివిజన్ పంచాయతీ అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో డీఎల్‌డీవోకు అదనపు బాధ్యలు అప్పగించారు. చీరాల, వేటపాలెం మండలాల్లో వీఆర్వోల కొరత కూడా ఉంది. దీంతో ముఖ్యమైన సర్టిఫికెట్ల మంజూరు చేసేందుకు కొంత జాప్యం ఏర్పడుతోంది. ఈ కారణంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ముఖ్యమైన శాఖలకు రెగ్యులర్ అధికారులను నియమిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయి. చీరాల నియోజకవర్గంలో అధికారులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నా అటు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, జిల్లా ముఖ్య అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కూటమి సర్కార్ పాలనలో అధికారులు కొరతతో ప్రజలు అల్లాడుతున్న పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు.



చీరాల మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం

అశోక్ కుమార్‌ను కలిసిన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి



అశోక్ కుమార్‌ను సత్కరిస్తున్న ప్రసాదరెడ్డి, స్థానిక నేతలు

బల్లికురవ: అద్దంకి వైఎస్సార్ సీపీ నూతన ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్‌ను శనివారం పార్టీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈయనతోపాటు బల్లికురవ మండల జేసీఎస్ కన్వీనర్ టి. నరేష్, స్థానిక నేతలు అవిశెన ప్రభాకర రెడ్డి, యం. వెంకటరెడ్డి, జి. నగేష్, రామాంజనేయపురం మాజీ వలంటీర్ బత్తుల రమేష్‌బాబులు ఇన్‌చార్జిని కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అద్దంకి నియోజకవర్గ ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అశోక్ కుమార్ ప్రకటించారు.

ఐక్య పోరాటాలతో సమస్యలకు పరిష్కారం



జిల్లా మహా సభలను నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: ఐక్య పోరాటాలతోనే అంగన్‌వాడీ సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర నాయకురాలు వై.సుజాతమ్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా రెండో మహాసభలు శనివారం స్థానిక బాపనమ్మ కళ్యాణ మండపంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వేతనాల పెంపు కోసం ఐక్య పోరాటమే మార్గమన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ మాట్లాడారు. గతంలో 42 రోజులు పాటు అంగన్‌వాడీలు సమ్మె చేసినప్పుడు ప్రస్తుత కూటమి నాయకులు మద్దతిచ్చారన్నారు. సమస్యలు పరిష్కరిస్తామని, వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఆ హామీలను ఇప్పుడు అమలు చేయాలన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా కె.ఝాన్సీ, కార్యదర్శిగా పి.రేఖా ఎలిజిబెత్, ఉపాధ్యక్షునిగా పి.ప్రమీల, అనిత, నాగమణి, శారద, బసవమ్మ, సహాయ కార్యదర్శులుగా ఎ.బ్యూలా, జ్యోతి నిర్మలత, మల్లీశ్వరి, రాణి, శైలజలతో పాటు 17 మంది సభ్యులతో కమిటీ ఎన్నుకున్నారు. వేటపాలెం ప్రాజెక్టు నాయకురాలు సుజీవనజ్యోతి, నిర్మల సులోచన, శిరీష, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వైవీని కలిసిన నూతన సమన్వయకర్త అశోక్ కుమార్

అద్దంకి: నియోజకవర్గ నూతన సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ శనివారం తాడేపల్లిలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. తనను అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించినందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, నాయకులకు కృతజ్ఞలు తెలియజేశారు. అద్దంకి సమన్వయకర్తగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేలా పనిచేస్తానని చెప్పారు. అలాగే నూతన సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ అశోక్ కుమార్‌ను పిడుగురాళ్లలో శనివారం అద్దంకి నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు.



వైవీ సుబ్బారెడ్డికి పుష్ప గుచ్ఛాన్ని అందిస్తున్న డాక్టర్ అశోక్ కుమార్

ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణ



కారంచేడులో ఎంఆర్‌పీఎస్ జెండా దిమ్మె ప్రారంభించి మాట్లాడుతున్న నాయకులు

కారంచేడు: ఎన్నో ఉద్యమాలకు పురిటిగడ్డగా నిలచిన కారంచేడు గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) జెండాను ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందని ఎంఆర్‌పీఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనర్సయ్య మాదిగ అన్నారు. శనివారం మండల కేంద్రమైన కారంచేడు ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన ఎంఆర్‌పీఎస్ స్థూపంతో పాటు, జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందా కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ఏర్పడటానికి కారణమైన కారంచేడు మాదిగపల్లెలో ఏర్పాటు చేసిన జెండా దిమ్మె ప్రారంభించారు. 30 సంవత్సరాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మాదిగలు అండ దండగా నిలచారన్నారు. దుడ్డు వందనం మాదిగ మాట్లాడుతూ కారంచేడు బాధిత పోరాటం.. గ్రామం నుంచి ఎంతో మందిని ఉద్యమం బాట పట్టించడం సంతోషకరమన్నారు. మున్నంగి నాగరాజు, లక్ష్మీనర్సయ్య మాదిగ, వందనం మాదిగలు గ్రామానికి చెందిన వారు కావడం సంతోషమని పలువురు వక్తలన్నారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు వంగేవరపు రమేష్ మాదిగ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు చుండూరు రమేష్ మాదిగ, వేల్పుల శ్యామ్ సుందర్, తేళ్ల ఏరువాక, తేళ్ల పుల్లరాజు, తేళ్ల రాంబాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

యద్దనపూడి: మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన మద్దుమాల పోలేశ్వరరావుకు మార్టూరుకు చెందిన హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు శనివారం ఆర్థికసాయం అందజేశారు. పది సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదంలో పోలేశ్వరావుకు కన్ను, కాళ్లు, చేతులు తీవ్ర గాయాలై మంచానికే పరిమితమయ్యాడు. కాగా పోలేశ్వరావు కుమారుడు కూడా పదో తరగతి చదువుతూ మృత్యువాత పడటంతో కుటుంబమంతా అతని భార్యపై ఆధారపడింది. ఈ విషయం మార్టూరు హెల్పింగ్ హాండ్స్ సంస్థ దృష్టికి రావటంతో సంస్థ సభ్యులు వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.7 వేలు నగదు, నిత్యావసరాలు అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు నల్లపునేని రంగయ్యచౌదరి, సంస్థ అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌వలి, కేబుల్ బాషా, ప్రధాన కార్యదర్శి పుట్టా అయ్యప్పస్వామి, షేక్ హాబీబా, బొల్లాపల్లి ఫాల్, సునీల్, వలి, బాబు, కరీమ్ తదితరులు పాల్గొన్నారు.



కోటేశ్వరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు

పశువుల్లో వ్యాధులు గుర్తించాలి

కొత్తపట్నం: వర్షాల సీజన్ కావడంతో పశువుల్లో వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆచార్య ఎన్‌జీ రంగా సర్వీస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. అందు కోసమే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో పశు సంవర్ధక శాఖ, ఎన్‌జీ రంగా సర్వీస్ ఫౌండేషన్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో శనివారం పశువైద్య శిబిరం, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆచార్య రంగా సర్వీస్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు నాదెండ్ల చంద్రశేఖరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 25 పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ చికిత్సలు, 42 పశువులకు సాధారణ వైద్య సేవలు, 800 గొర్రెలకు బలవర్ధక మందులు, 125 లేగ దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు నామినేని మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, సభ్యులు నాగినేని అవనీంద్ర ప్రసాద్, ఆత్మ (ఏటీఎంఏ) ఒంగోలు ఎఫ్ఐఏసీ బీటీఎం కృష్ణా, త్రోవగుంట పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి.బసవ శంకర్‌రావు, ఒంగోలు, కొత్తపట్నం మండలాల పశువైద్యులు డాక్టర్ అమూల్య, డాక్టర్ సోమశేఖర్, రాజుపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుటూరి కోటేశ్వరరావు, ఆచార్య ఎన్‌జీ రంగా సర్వీస్ ఫౌండేషన్ ప్రతినిధులు మండవ రంగారావు, మండవ శ్రీనివాసరావు, దూళిపాల వీర నారాయణ, గుండవరపు కోటేశ్వరరావు, బోడపాటి కోటేశ్వరరావు, వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 586 కేసుల పరిష్కారం

పర్చూరు (చిన్నగంజాం): పర్చూరు కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 586 కేసులు పరిష్కారం అయ్యాయి. లోక్ అదాలత్‌కు రెండు బెంచీలు ఏర్పాటు చేశారు. మొదటి బెంచ్‌కి కె.ప్రశాంతి అధ్యక్షత వహించగా న్యాయవాదులు పి.జాన్‌బాబు, ఆర్.రమేష్‌బాబు సభ్యులుగా వ్యవహరించారు. రెండో బెంచ్‌కి పి.శాంతి అధ్యక్షత వహించగా న్యాయవాదులు కట్టా సాల్మన్. కె.ధనలక్ష్మి సభ్యులుగా వ్యవహరించారు. అదాలత్‌లో 13 సివిల్ కేసులు, నాలుగు వివాహ సంబంధ కేసులు, 31 క్రిమినల్ కేసులు, 13 ఎంక్వైరీ కేసులు, 525 పెట్టీ కేసులు పరిష్కారం అయ్యాయి. కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్.సత్యనారాయణ, చాగంటి సుబ్బారావు, సీహెచ్ శ్రీరమణి పాల్గొన్నారు.

రౌడీషీటర్లు శాంతియుత జీవనం సాగించాలి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ శేషగిరిరావు

చీరాల అర్బన్: రౌడీషీటర్లు శాంతియుత జీవనాన్ని సాగించాలని రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. శనివారం చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ ఆధ్వర్యంలో చీరాల రూరల్ సర్కిల్, వేటపాలెం పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన రౌడీషీటర్లుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రూరల్ సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు శాంతియుత జీవనాన్ని సాగించాలని, గొడవల్లో పాలుపంచుకోవద్దన్నారు. ఎవరైనా గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈపురుపాలెం, వేటపాలెం ఎస్సైలు ఎ.చంద్రశేఖర్, జనార్దన్‌లు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం భాద్రపద మాసం రోహిణి నక్షత్రం సప్తమి ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

క్షయ వ్యాధి ప్రమాదకరం



పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న క్షయ నివారణ, వైద్య ఆరోగ్య సిబ్బంది

చీరాల రూరల్: సమాజంలో పెరుగుతున్న క్షయ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వ్యాధిని ముందుగానే గుర్తించి మందులు వాడుకున్నట్లయితే పూర్తిగా తగ్గిపోతుందని బాపట్ల జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ షేక్ మహమ్మద్ సాధిక్ అన్నారు. ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా ఈపురుపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఫినిష్ సొసైటీ, ప్రొటెక్ట్ సంస్థల ఆధ్వర్యంలో ఐటీసీ లిమిటెడ్ అగ్రి బిజినెస్ డివిజన్ చీరాల, బాపట్ల జిల్లా వైద్యశాఖ, జిల్లా క్షయనివారణ శాఖల సౌజన్యంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ షేక్ మహమ్మద్ సాధిక్ మాట్లాడారు. క్షయ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, కళ్లెలో రక్తం పడడం, బరువు తగ్గడం, అలసటగా ఉండడం, రాత్రి సమయాల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే టీబీ యూనిట్‌లోని వైద్యులను సంప్రదించాలన్నారు. అక్కడ లభించే ఉచిత మందులను వైద్యుల సలహాల మేరకు వాడుకుంటూ బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఐటీసీ హెచ్‌ఆర్ మేనేజర్ ఎస్. రామకృష్ణారావు, ఈహెచ్‌ఎస్ మేనేజర్ ఎంఎస్‌ఎస్ రెడ్డి మాట్లాడుతూ వైద్యుల సలహాలను పాటించి మందులు వాడుకోవాలని సూచించారు.

ఉచిత వైద్యశిబిరానికి హాజరైన 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు యాకబ్, జ్యోతిర్మయి, ప్రొటెక్టు సంస్థ కార్యదర్శి శవనం చంద్రారెడ్డి, ఫినిష్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ నవీన్, ఎన్‌టీఈపీ స్టాఫ్, చీరాల టీబీ యూనిట్ స్టాఫ్, పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

అద్దంకి రూరల్: మండలంలోని ప్రముఖపుణ్య క్షేత్రమైన శింగరకొండపై వేంచేసి ఉన్న లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానంలో దసరా నవరాత్రులు ఉత్సవాలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై శనివారం దేవస్థాన పాలకమండలి సమావేశంలో చర్చించారు. భక్తుల మంచినీటి సౌకర్యం కోసం మినరల్ వాటర్ ప్లాంటు, మహా మండపం ఫ్లోరింగ్‌కు గ్రానైట్ రాళ్లు, ఏర్పాటు చేసిన దాతలను సన్మానించారు. ఆదేవిధంగా నక్షత్రవనంలో మొక్కలు నాటి డ్రిప్ పంపులు, ట్రీగార్డు ఏర్పాట్లు చేయటానికి కమిటీ తీర్మానించారు. దేవస్థానం వద్ద అసంపూర్తిగా ఉన్న అన్నదానం భవనం, నిర్మాణ పనులు నిలిచిపోయిన వసతి గృహం దాతల నుంచి ఎప్పటి పూర్తి చేస్తారో లిఖిత పూర్వక హామీ తీసుకున్నారు. దేవస్థానంలో అన్నదాన పథకానికి అధికారుల నుంచి అనుమతులు పొందాలని కమిటీ సభ్యులు తీర్మానించారు.



దేవస్థాన పాలక మండలి సమావేశంలో అధ్యక్షుడు, సభ్యులు

జాతీయ అదాలత్‌లో 1671 కేసుల పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ

చీరాల రూరల్: లోక్ అదాలత్‌లో సత్వరమే న్యాయ పరిష్కారం దొరుకుతుందని, కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులను అదాలత్‌ల ద్వారా పరిష్కారం చేసుకున్నట్లయితే సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతాయని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ కక్షిదారులకు సూచించారు. శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సుధ మాట్లాడారు. లోక్ అదాలత్‌లో న్యాయమూర్తుల సమక్షంలో పరిష్కారమైన కేసుల విషయంలో ఇతర కోర్టులలో అప్పీలు చేసుకునే అవకాశం లేదన్నారు. సివిల్ కేసులకు సంభందించి పరిష్కారమైన కేసుల్లో కక్షిదారులు కోర్టులో చెల్లించిన ఫీజులు తిరిగి చెల్లిస్తారని చెప్పారు.

1671 కేసుల పరిష్కారం..

స్థానిక కోర్టు భవన సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1671 కేసులు పరిష్కరించారు. వాటిలో సివిల్ కేసులు 6, క్రిమినల్ కేసులు 315, ఎస్‌టీసీ కేసులు 1350 పరిష్కరించారు. అదాలత్‌కు ప్రిసైడింగ్ అధికారులుగా సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట వాహిని, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కాత్యాయిని, అదాలత్ మెంబర్లుగా న్యాయవాదులు కె. సుబ్రహ్మణ్యం, సీహెచ్. సురేష్, ఎ. సతీష్ రెడ్డి, పీఎల్‌వీలు మతిన్, సుభాని, ఇమ్మానుయేలు, వ్యవహరించారు.

క్లుప్తంగా

మద్దినేని హనుమంతరావు మరణం తీరని లోటు

ఇంకొల్లు (చిన్నగంజాం): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మద్దినేని హనుమంతరావు (89) మరణం తీరని లోటని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమంతరావు తన చిరకాల మిత్రుడని, రాజకీయాల్లో తన అనుచరుడిగా ఉంటూరు ఇద్దరం ఎంతో కాలం కాంగ్రెస్ పార్టీలో కలిసి పనిచేశామని వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆయన మంచి నాయకుడిగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా, పావులూరు పొలిమేర ఆంజనేయస్వామి ఆలయ పాలకవర్గం సభ్యుడుగా పలు పదవులు నిర్వహించారన్నారు. పర్చూరు రాజకీయ చరిత్రలో సమర్థుడైన నాయకుడిగా పేరు పొందారని చెప్పారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని, ఆయన మరణవార్త తెలియగానే కుటుంబ సభ్యులతో మాట్లాడి సంతాపాన్ని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి తన సంతాపాన్ని తెలిపారు.

లోక్ అదాలత్‌లో 739 కేసుల పరిష్కారం

అద్దంకి రూరల్: అద్దంకి కోర్టు భవనాల్లో శనివారం సీనియర్ సివిల్ జడ్జి డి. వెంకట నాగ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 739 కేసులు పరిష్కరించారు. వీటిలో సివిల్ కేసులు 27, క్రిమినల్ కేసులు 176, చెక్ బౌన్స్ కేసులు 02, పెట్టి కేసులు 534 ఉన్నాయి. కేసులుకు సంబంధించిన లావాదేవిలు రూ. 56,74,900 జరిగాయి. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి. అఖిల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు, లోక్ అదాలత్ సభ్యులు కె.రామకృష్ణరావు, యం. శ్రీనివాసరావు, డి. హయగ్రీవాచారి, ఏఎం. సత్యవతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం



మద్దినేని హనుమంతరావు (ఫైల్)

ఇంకొల్లు (చిన్నగంజాం): ఇంకొల్లు మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షుడు, పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా పనిచేసిన మద్దినేని హనుమంతరావు (89) శనివారం మరణించారు. కుటుంబ సభ్యుల సమ్మతితో గుంటూరు శంకర్ నేత్రాలయం వారు మద్దినేని హనుమంతరావు కంటి కార్నియాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామమోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, రోటరీ సభ్యులు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చీరాల టౌన్: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతని.. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు గ్రామస్తులకు సూచించారు. శనివారం రామకృష్ణాపురం గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించారు. పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి పంపిణీ చేసిన డస్ట్‌బిన్లను వినియోగించుకుని తడిచెత్త, పొడిచెత్తను బుట్టల్లో వేర్వేరుగా నిల్వచేసి పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బుట్టలను అందించాలన్నారు.

16న ఉచిత కంటి వైద్య శిబిరం

వేటపాలెం: రైల్వే స్టేషన్ రోడ్డులోగల రోటరీ కమ్యూనిటీ హాల్లో రోటరీ క్లబ్ ఆఫ్ వేటపాలెం ఆధ్వర్యంలో, సాస్మర్ట్‌విజన్ ఐ హాస్పిటల్ వైద్యనిపుణలచే ఉచిత కంటి వైద్య శిబిరం ఈ నెల 16వ తేదీన ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు ఏవీ సురేష్ బాబు శనివారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించు కోవాలని సూచించారు.

కాటాలను రెన్యువల్ చేయించుకోండి

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి వ్యాపారస్తుడు విధిగా వారి తూకం (కాటాలను) ఏడాదికి ఒకసారి రెన్యువల్ చేయించుకుని వ్యాపార కార్యకలాపాలు చేసుకోవాలని తూనికలు, కొలతల శాఖ చీరాల ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు సూచించారు. శనివారం ఈపురుపాలెం, దేవాంగపురి గ్రామాల్లోని కూరగాయల మార్కెట్లు, పండ్ల దుకాణాల్లో కాటాల రెన్యువల్స్ పరిశీలించారు. ఏడుగురు వ్యాపారులు తమ కాటాలను రెన్యువల్ చేయించుకోకుండా వ్యాపారాలు చేస్తుండటంతో వారిపై కేసులు నమోదు చేశారు. తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి వ్యాపారస్తుడు విధిగా తమ తూకం కొలిచే కాటాలను, రాళ్లను విధిగా రెన్యువల్ చేయించుకుని క్రమబద్ధీకరించుకోవాలన్నారు. వినియోగదారులకు తూకాల్లో మోసాలు జరగకుండా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి ఆదేశాన్ని విధిగా పాటించాలన్నారు. తూకం రాళ్లు, డిజిటల్ కాటాలను తూనికల ఇన్‌స్పెక్టర్ వద్ద రెన్యువల్ చేయించుకోవాలని, తూకంలో తేడాలు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. వినియోగదారులను మోసాలకు గురిచేస్తే వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.